కథ

# ఇదే నిజమైతే

-రేణుక అయోల



మొఖం కడుక్కొని కాఫీ కప్పుతో హాల్లోకి వచ్చి టయిము చూశాడు. తొమ్మిది గం॥లు చూపి స్తోంది గడియారం. అబ్బా తొమ్మిది అయిందా? అనుకుంటూ అలా అను కోవడంలో ఒక తృప్తి, ఆనందం. ఆదివారం లేటుగా లేవాలి, అప్పుడే సెలవని సెలవులా గడిపి నట్లు అనిపిస్తుంది. అయినా అలవాటు ప్రకారం తొందర గానే తెలివి వస్తుంది. అయినా సరే తొందరగా లేవకూడదు అన్న నియ మంతో లేవడు...

ఒక్కొక్క పేపరు తిరగేనన్తాంటే ఆరోజు

ఆరోజు ఆదివారం. తెలివి వచ్చినా బద్దకంగా పక్కమీదనే దొర్లుతున్నాడు రామనాథం.

పేపర్లు వచ్చాయా? అంటూ పక్కమీదనుంచే గావుకేకపెట్టాడు.... ఆ అన్నీ వచ్చాయి ముందు లేచి ముఖం కడుక్కోండి.అంటూ జవాబు ఇచ్చింది కనకం.

న్యూస్‌పేపర్ అన్నా, న్యూస్ చానల్స్ అన్నా మహా ఇష్టం రామనాథంకి. ఆదివారం అన్ని వార్తా పత్రికలు తెప్పించుకుని, ఆ కొసనుంచి ఈ కొసవరకూ చదివి ఏవైనా ముఖ్యమైన సంఘటనలు చదివితే కదిలిపోతూ ఎమోషనల్‌గా ఫీల్ అయిపోతూ, ఆ వార్త గురించి భార్యతో చర్చిస్తూ ఉంటాడు.

అన్నింటిలోనూ ఒకటే వార్త ఫలానాచోట "బాంబుదాడి"లో 200 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు, తెగిపోయిన మొండాలు,రక్తం ధారలు కట్టిన ఫోటోలు, మనసంతా పాడైపోయింది. అప్పట్లో జపానులో అణుబాంబు వలన ఎంత విధ్వంసం జరిగిందో, మళ్లీ ఆదేశం ఎలా నిలదొక్కుకుందో ఇప్పటికీ చెప్పుకుంటాము. అప్పట్లో బాంబు అంటేనే భయం ఊహకందని విషయం, కాని ఇప్పుడు "దీపావళి టపాసుల్లా" ఎక్కడ పడితే అక్కడ పేలుతున్నాయి.... రేపొద్దున్న ఇవి కూరగాయల్లా వీధిలో అమ్మొచ్చినా ఆశ్చర్యపోన ఖ్ఖరలేదు....

ఒంటిగంట అవుతుంది భోజనానికి లేవండీ, అంటూ శ్రీమతి పిలుపుతో పేపర్లు పక్కన పెట్టి ఒళ్లు విరుచుకున్నాడు రామనాథం.

"బాంబులండీ బాంబులు చిన్న చిన్న బాంబులు, పెద్ద పెద్ద బాంబులు, అత్తాకోడళ్ళ బాంబులు, వగ కక్షల బాంబులు, మీకు ఎలాంటివి కావలసి వస్తే అలాంటివి మాదగ్గర దొరుకుతాయి'' అంటూ తమాషా గొంతుతో అమ్మకం మొదలుపెట్టాడు. అది విన్న రామనాథం ఆశ్చర్యపడిపోయాడు.... ఇదేమిటీ పొద్దున్నేగా పేపరు చదువుతూ అనుకున్నాను, ఇంతలోనే నిజమైపోయిందా? ఉలిక్కిపడి, గబగబా గది తలుపులు తీసి వరండాలోకి వచ్చి తెరిచి చూశాడు. మెయిన్ రోడ్డు మీద తోపుడుబండిలో అందంగా అలంకరించిన రకరకాల బుట్టల్లో "బాంబులు" పేర్చుకుని అమ్ముతున్నాడు.

అమ్మబాబోయ్ ఏమిటి కలికాలం? ఇంత పబ్లిక్‌గా అమ్ముతున్నాడు. భయం లేదా? పోలీసులకి ఈ విషయం తెలుసా? అనుకుంటూ కంగారు పడిపోయాడు, ఏం చెయ్యాలో అర్ధం కాలేదు, భార్యకి విషయం చెబుదామని చూసాడు. భార్య కనిపించలేదు. ఇంక స్థిమితంగా ఉండలేకపోయాడు. వాడి దగ్గరికి వెళ్లి అసలు విషయం కనుక్కోవాలి, వీలైతే పోలీసులకి ఈ విషయం చెప్పాలి, అనుకుంటూ చెప్పులు వేసుకుని బయలుదేరాడు.

"అసలు వీడికి ఇంతధైర్యం ఎక్కడనుంచి వచ్చింది? ముందు చెడామడా తిట్టాలి. అసలే దేశం "బాంబు పేలుళ్లతో ఉడికిపోతుంది" ఇలాంటి సమయంలో విచ్చలవిడిగా అమ్ముతున్నాడు. అసలు వాడు అమ్ముతున్నవన్నీ ఒక్కసారిగా పేలితే ఎంత జననష్టం, ఇలా ఆలోచించుకుంటూ కోపంతో రోడ్డు దాటి వాడి దగ్గరికి వెళ్లాడు.

## మొదటి టాకీ చలనచిత్రం

1931 మార్చి 14న విడుదలైన 'ఆలం ఆరా' తో భారతీయ టాకీ చలన చిత్రాలు ఆరంభమయ్యాయి. దీనిని ఇంపీరియల్ ఫిలిం కంపెని నిర్మించింది. బొంబాయిలోని మెజెస్టిక్ థియేటర్‌లో ఈ చిత్రం విడుదలయ్యింది. తెలుగులో మొదటి శబ్దచిత్రం 'భక్త ప్రహ్లాద', తమిళంలో మొదటి శబ్దచిత్రం 'కాళిదాస' 1931లోనే విడుదలయ్యాయి. ఈ రెండు చిత్రాలకు హెచ్.ఎమ్.రెడ్డి దర్శకుడు.

"ఆ రండి సార్ రండి" చూశారా ఎన్ని వెరైటి బాంబులు ఉన్నాయో!! ఇది చూడండి చాలా చిన్నది, మీ బాసుగాడు ఆఫీసులో ఏమైన గొడవ పెట్టుకున్నాడను కోండి దీనితో సరదాగా భయ పెట్టండి, ఒకవేళ వాడి మీద వేసినా ఫరవాలేదు. నాలుగు రోజులు జ్వరంతో వడు కుంటాడు. మళ్లీ లేస్తాడు. మీ పక్కింటి వాళ్లతో తగాదాలు ఉన్నాయనుకోండి ఈ ఎర్రరంగు బాంబు వెయ్యండి, చాలా చిన్నది మళ్లీ మీ జోలికి రాడు. అంటూ వాడి దగ్గర ఉన్నవన్నీ ఏదో ఆట వస్తువుల్లా చూపిస్తున్నాడు. చుట్టూ చేరిన జనం కూడా వింటున్నారు. వాడు వేసే జోకులకి నవ్వుతున్నారు. ఏమాత్రం చీకు చింతా లేకుండా!! అంతా కరుడు కట్టిన రాక్షసుల్లా కనిపించారు. మానవత్వం నశించి పోతోంది లేకపోతే ఏమిటి వాడ్ని చితకతన్ని పోలీసులకి అప్పగించకుండా, వాడు చెప్పే వెధవ మాటలకి నవ్వుతున్నారు.

"ముందు ఈ బాంబులు అమ్మడం ఆపేయి, అసలు బుద్ధి,జ్ఞానం ఉందా? ప్రమాదకరమైన వాటిని ఇంత తేలికగా రోడ్డుమీద అమ్ముతున్నావు? పోలీసులకి తెలిసిందంటే? తెలియడమేమిటి? నేనే నిన్ను తీసుకువెళ్లి అప్పచెబుతాను. అన్నాడు ఆవేశంగా రామనాథం.....

ఊరుకోండి సార్, మీరు యింకా ఏలోకంలో ఉన్నారు? వాళ్ళు కూడా నాదగ్గరే తీసుకుంటారు కిలోలెక్కన. పాపం వాళ్లు మాత్రం ఏం చేస్తారు సార్, ఖరీదైన తుపాకులు ఉండవు.... అస్తమానం బాంబులు పెట్టి వాళ్లని పేల్చిపారేస్తుంటే ఎంతకని సహిస్తారు వాళ్లు కూడా మనుషులే కదా!! అయినా మనలో మాట మీకో విషయం చెబుతాను వినండి. అందరి దగ్గర బాంబులు ఉన్నాయనుకోండి, ఎవరిమీద ఎవరూ వేసుకోరు, ఎందుకంటే వాడు మీమీద వేసేలోగా మీరు వాడి మీద వేసేస్తారుగా!!

మీ దగ్గర లేకపోతే కదాసార్, వాడు మిమ్మల్ని బెదిరించేది భయ పెట్టేది? ఎలా ఉంది సార్ నా ప్లాన్.... అందుకే అందరూ కొనుక్కొని వెళుతున్నారు, మీరు ఈకాలనీకి కొత్తగా వచ్చినట్లు ఉన్నారు అన్నాడు.... రామనాథం వైపు చూస్తూ నవ్వుతూ..

"అయినా ఎంత కాలంమారినా ఇంతలా మనిషి ప్రాణాలు లెక్కలేకుండా ఇలాంటి వ్యాపారామా? బుద్ధిజ్ఞానం లేదు, ఇంకా సమర్ధించు కుంటు న్నావు.... అంటూ ఏదో అనబోతూ ఉండగా రామనాథాన్ని తోసుకుంటూ టి.వి.వాళ్ళు వచ్చారు.

సార్ మీరు కొద్దిగా పక్కకి తప్పుకోండి, ముందు ఇతనిని ప్రశ్నించాక మీ అభిప్రాయాలు కూడా చెప్పాలి అంటూ...

"మీకుఇలాంటి వ్యాపారం చెయ్యాలని ఏలా తట్టింది? ఈ వ్యాపారం లాభాల బాటలో నడుస్తోంది కదా?దీనివెనుక మీ కృషి, మీ స్పందన తెలియజేస్తారా అంటూ మొదలుపెట్టారు, వాడి చేతిలో మైకు పెట్టి, కెమేరా వాడికేసి తిప్పి హడావిడి చేస్తున్నారు. ఎవరి మొఖాల్లోను ఆందోళన లేదు. నేనింతగా వాడితో కొట్లాడుతున్నా, ఎవరూ నన్ను సమర్ధిస్తూ ఒక్కమాట మాట్లాడలేదు. తాపీగా నడుచుకుంటూ పోతున్నారు. ఏమిటిది నాకొక్కడికేనా ఈ బాధ, అనుకుంటూ మెల్లగా నడుచుకుంటూ ఇంటివైపుకి నడిచివస్తుంటే...

భార్య కనకం సంచి పట్టుకుని బాంబులున్న బండివైపు వెళుతూ కనిపించింది....

అమ్మో కనకం కూడానా... నేను ఏదైనా అంటే నా మీద బాంబు వెయ్యడానికా...? కనకం కనకం అంటూ పెద్దగా పిలుస్తూ అరిచాడు.. రామనాథం.

"ఏవండీ ఏవండీ" లేవండీ, ఏమిటీ ఇంత మొద్దునిద్ర, పైగా పలవరింతలు కూడా అంటూ కుదుపుతూ లేపిన భార్యవైపు బలవంతంగా కళ్లు విప్పి చూశాడు...ఏమిటి అలా చూస్తున్నారు." ఏదైనా భయంకరమైన కల వచ్చిందా! అని నవ్వుతూ అడుగుతున్న కనకాన్ని చూస్తేగాని అర్ధం కాలేదు, తాను కలకన్నాడనీ... అయినా నమ్మబుద్ధి కాలేదు, మంచంమీద నుంచి ఒక్క దూకు దూకి వరండాలోకి వెళ్లి చూసాడు అంతా మామూలుగానే ఉంది సాయంకాలం అవుతుంది. అక్కడ ఎలాంటి తోపుడు బండి లేదు.

కనకం ఇచ్చిన "టీ" కప్పు తెచ్చుకొని హాల్లోకి వచ్చి కుర్చీలో కూలబడి "టీ" తాగుతూ కూడా ఆలోచిస్తున్నాడు. తనకొచ్చిన వింత కల గురించి...

ఇదే నిజమైతే దేశం పరిస్థితి ఏమిటి? అను కుంటూ...... ★

